క్లుప్తంగా

విమ్స్ డైరెక్టర్‌కు సత్కారం



విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబును సత్కరిస్తున్న వైద్యేతర సిబ్బంది

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబును గురువారం వైద్యేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఇటీవల రాష్ట్రానికి మొదటిసారి జీవన్‌ధాన్ అవార్డు లభించిన విషయం తెలిసిందే. ఈ నెల 3న న్యూఢిల్లీలో జరిగిన జాతీయ అవయవదాన దినోత్సవంలో రాష్ట్రం తరఫున ఆయన జీవన్‌ధాన్ కో ఆర్డినేటర్ హోదాలో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబును ఇక్కడ వైద్యేతర సిబ్బంది సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. సిబ్బందికి డైరెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

రైతుబజార్ కిటకిట



సీతమ్మధార రైతుబజారులో పువ్వులు కొనుగోలు చేస్తున్న మహిళలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ వినియోగదారులతో కిటకిటలాడింది. తొలి శ్రావణ గురువారం కావడంతో ఉదయం నుంచే అధిక సంఖ్యలో మహిళలు రైతుబజార్‌కు వచ్చి చామంతి, బంతి, గులాబీ మొదలగు పువ్వులు కొనుగోలు చేశారు. బజారులో గురువారం కిలో చామంతి(హైబ్రిడ్) రూ.400, బంతి రూ.150, గులాబీ రూ.250, ఆరెంజ్ బంతి రూ.35, పసుపుబంతి దండలు రూ.40 చొప్పున విక్రయించారు. మల్లిపూలు మూర రూ.80, జాజిపూలు మూర రూ.50, కనకాంబరాలు మూర రూ.90, కాగడాలు మూర రూ.50 వంతులు అమ్మకాలు సాగించారు. మల్లి, బంతి దండలు ఎక్కువ పరిమాణంలో విక్రయించడం కనిపించింది. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. గత నెలతో పోలిస్తే పువ్వుల ధరలు స్వల్పంగా పెరిగాయని సిబ్బంది తెలిపారు.

బుద్ధదేవ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సీపీఎం నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. మద్దిలపాలెంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు మాజీ సీఎం సేవలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.వెంకటరావు, కె.కుమారి, ఎం.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జోడుగుళ్లపాలెంలో వెన్నెల కిషోర్ సందడి



లొకేషన్‌లో నటుడు వెన్నెల కిషోర్

కొమ్మాది : బీచ్ రోడ్డు జోడుగుళ్లపాలెంలో గురువారం షూటింగ్ సందడి నెలకొంది. నటులు వెన్నెల కిషోర్, ప్రియదర్శిపై పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. గత వారం రోజుల నుంచి విశాఖ – భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతాల్లో శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మాణంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరించారు. హీరోయిన్‌గా రూప కొడువాయూర్ నటిస్తున్న సంగతి తెలిసిందే. గురువారంతో ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ తెలిపింది.



ఆధునికంగా నిర్మించిన ఫుట్‌పాత్



మెంటల్ కేర్ ఆస్పత్రి వద్ద ఆధునికీకరించిన రహదారి



చినవాల్తేర్ కూడలిలో శ్రీకృష్ణుడి విగ్రహంతో కూడిన ఫౌంటెయిన్

ఫిదా

- ఆకర్షణీయంగా మెంటల్ కేర్ ఆస్పత్రి రహదారి
- సెల్ఫీ స్పాట్‌గా చినవాల్తేర్ జంక్షన్
- స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేసిన జీవీఎంసీ



రాత్రి వేళ విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతున్న రహదారి

ఎంవీపీకాలనీ: స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా జీవీఎంసీ అభివృద్ధి చేసిన మెంటల్ కేర్ హాస్పిటల్ రహదారి నగరవాసుల మదిని దోచుకుంటోంది. ఈ రోడ్డు ఆధునికీకరణలో వినియోగించిన నిర్మాణ శైలి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు అటుగా వెళ్లే వారంతా ఫిదా అవుతున్నారు. భవిష్యత్ నగర బ్యూటిఫికేషన్స్‌కు ఈ రోడ్డు అద్దం పడుతోందంటూ కితాబిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఈ రోడ్డు అందాలను వారి సెల్‌ఫోన్‌లో బంధిస్తున్నారు. నగర యువత ఈ రోడ్డును ఏకంగా సెల్ఫీ స్పాట్‌గా మార్చేశారు. పగలు పచ్చని మొక్కలతో కూడిన డివైడర్, ఫుట్‌పాత్‌లపై నిల్చుని ఫొటోలు దిగుతున్నారు. రాత్రి పూట మిరుమెట్లు గొలిపే విద్యుత్ కాంతులు, చినవాల్తేర్ నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన తాండవ కృష్ణుడి వాటర్ ఫౌంటెయిన్ వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.

రూ.5 కోట్లతో నిర్మాణం

దాదాపు రూ.5 కోట్లతో 1.5 కిలోమీటర్ల పరిధిలో ఈ రోడ్డును జీవీఎంసీ ప్రాజెక్టు విభాగం నిర్మించింది. గతంలో ఉన్న 40 అడుగుల రోడ్డును విస్తరించి 80 అడుగుల రహదారిగా తీర్చిదిద్దారు. రెండు వైపుల ఫుట్‌పాత్, ఐరన్ రైలింగ్, ఫుట్‌పాత్‌ను ఆనుకొని మొక్కలు నాటి ఐరన్ గ్రిల్స్ రక్షణ కల్పించారు. రోడ్డు మధ్యలో డివైడర్‌ను నిర్మించడంతో పాటు చక్కటి మొక్కలతో పచ్చదనాన్ని వెదజల్లే ఏర్పాట్లు చేశారు. డివైడర్ మధ్యలోను, రోడ్డు ఇరువైపులా రాజసం ఉట్టిపడే డిజైన్లతో కూడిన విద్యుత్ స్తంభాలు, దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో ఈ రోడ్డు అత్యంత ఆకర్షణీయంగా మారి నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది.


దేశ ఆర్థికాభివృద్ధిలో మత్స్యకారుల పాత్ర కీలకం



ఏయూ విద్యా విభాగాధిపతి షారోన్ రాజు

విశాఖ సిటీ: దేశ ఆర్థికాభివృద్ధిలో మత్స్యకారులు, మత్స్య అనుబంధ పరిశ్రమల పాత్ర కీలకమని ఏయూ విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు అన్నారు. ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పోర్ట్ బ్లెయిర్‌లోని జోనల్ కార్యాలయంలో గురువారం మత్స్యకారులకు అవగాహన సదస్సు జరిగింది. రిసోర్స్‌పర్సన్‌గా పాల్గొన్న ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ దేశానికి తీర ప్రాంతం అతిపెద్ద ఆర్థిక వనరుగా నిలుస్తోందన్నారు. ఇది ప్రత్యక్షంగా మత్స్యకారులకు ఉపాధిని కల్పించడంతో పాటు, పరోక్షంగా అనుబంధ పరిశ్రమలకు స్థానం కల్పిస్తోందని వివరించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఈ రంగాన్ని పటిష్టం చేయడం ఎంతో అవసరమన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, నిపుణుల సూచనలను ఎప్పటికప్పుడు వినియోగించుకుంటూ వేట సాగించాలని సూచించారు. మత్స్యకారులకు జీవిత బీమా భద్రత కల్పించడం, రాయితీపై రుణాలు అందించడం, మత్స్యకార చిన్నారులకు విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పించడం అవసరమని చెప్పారు. అనంతరం నిర్వాహకులు ఆచార్య షారోన్ రాజును సత్కరించారు. పాండిచ్చేరి యూనివర్సిటీ విద్యార్థులకు కూడా ఆయన అవగాహన కల్పించారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



ఫ్లాట్‌లో దగ్ధమైన భాగం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. విశాలాక్షినగర్ గీతాంజలి సామాజిక భవనం ఎదురుగా సాయిశ్రీ రెసిడెన్సీలోని ఒక ఫ్లాట్‌లో శ్రీనివాసరావు దంపతులు నివసిస్తున్నారు. శ్రీనివాసరావు ఏయూలో ఉద్యోగి. ఆయన భార్య ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు. వారిద్దరు గురువారం ఉదయం డ్యూటీకి వెళ్లిన కొంత సేపటికి ఆ ఫ్లాట్ నుంచి పొగలు బయటకు వచ్చాయి. స్థానికులు గమనించి ఇంట్లో అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని భావించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే ఫ్లాట్‌లోని బీరువాలు, మంచాలు, దుస్తులు తదితర సామగ్రి కాలిపోయి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు ఇంటి వద్దకు చేరుకొని సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా శ్రీనివాసరావు భార్య దేవుడి గదిలో పూజ చేసే సమయంలో దీపం వెలిగించి అనంతరం డ్యూటీకి వెళ్లడంతో దాని మంట ఎగిసిపడి సమీపంలో ఉన్న దేనినైనా అంటుకోవడం వల్ల ప్రమాదానికి కారణమై ఉంటుందని కొందరు భావిస్తున్నారు. తాము ఇంట్లో ఉన్న సమయంలోనే దీపం ఆరిపోయిందని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని శ్రీనివాసరావు తెలిపారు.

ప్రశాంతంగా స్కూల్ కమిటీ ఎన్నికలు



తోటగరువు హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ ఎన్నికకు హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న కేడీపీఎం స్కూల్ కమిటీ సభ్యులు

ఆరిలోవ/ఎంవీపీకాలనీ/మద్దిలపాలెం: తూర్పు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 4 హైస్కూళ్లు, ఒక గురుకుల పాఠశాల, 22 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. సుమారు అన్ని ప్రాథమిక పాఠశాలల్లో కమిటీలు ఏకగ్రీవమయ్యాయి. ఉన్నత పాఠశాలల్లో మాత్రం విద్యార్థుల తల్లిదండ్రులు పోటీకి నిలిచారు. పలుచోట్ల పాఠశాలల్లో స్థానిక టీడీపీ నాయకులు హడావుడి చేశారు.

- ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సుమారు 1,500 మంది విద్యార్థులున్నారు. తరగతికి ముగ్గురు చొప్పున 15 మంది సభ్యులు ఓటింగ్ ద్వారా ఎన్నికయ్యారు. వారంతా కమిటీ చైర్మన్‌గా చుక్క జాన్‌ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్‌గా కె.పావనికుమారిని ఎన్నుకున్నారు. పాఠశాల కమిటీ ఎన్నిక సమయంలో హెచ్‌ఎం దుర్గాభవాని కొందరు స్థానిక టీడీపీ నాయకులను ఆహ్వానించారు. వారి సమక్షంలో ఎన్నికలు నిర్వహించడంపై హెచ్‌ఎంపై విమర్శలు వినిపిస్తున్నాయి.
- శ్రీకృష్ణాపురం గురుకులంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు 15 మంది కమిటీ సభ్యులను ఓటింగ్ ద్వారా ఎన్నికున్నారు. చైర్మన్‌గా కె.గంగరాజు, వైస్ చైర్‌పర్సన్‌గా టి.నేలవేణి ఎన్నికయ్యారు. పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, దీన్‌దయాల్‌పురం, ఆపరేషన్ కాలనీ, అంబేడ్కర్ నగర్, సంతపాలెం, పెదగదిలి, తోటగరువు, గాంధీనగర్, ఎస్.ఐ.జి.నగర్, ఇందిరానగర్, క్రాంతినగర్, ఎస్సీ, ఎస్టీ కాలనీ, జోడుగుళ్లపాలెం ప్రాథమిక పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 15 మంది చొప్పున సభ్యులను, చైర్మన్, వైస్ చైర్మన్లను ఎనుకున్నారు. వారికి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు కమిటీల విధివిధానాల గురించి తెలియజేశారు.
- జీవీఎంసీ 20వ వార్డు ఈస్ట్ పాయింట్ కాలనీ కేడీపీఎం స్కూల్‌లో హెచ్‌ఎం సుమతి బాయ్ పర్యవేక్షణలో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. త్రీటౌన్ పోలీసులు పర్యవేక్షించారు. కమిటీ చైర్మన్‌గా ఎ.వెంకటలక్ష్మి, వైస్ చైర్మన్‌గా కె.మాధవితోపాటు మరో 13 మంది సభ్యులు ఎన్నికయ్యారు.
- 18వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని జీవీఎంసీ స్కూల్‌లో హెచ్‌ఎం సురేష్‌కుమార్ ఎన్నికల పక్రియను ప్రారంభించారు. పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్‌గా షేక్ జరీనా బేగమ్, వైస్ చైర్‌పర్సన్‌గా ఇ.కొండమ్మ, మరో 13 మంది సభ్యులుగా నియమితులయ్యారు. వారితో హెచ్‌ఎం ప్రమాణం చేయించారు.
- 16వ వార్డు ఇసుకతోట అంబేడ్కర్ నగర్‌లోని జీవీఎంసీ స్కూల్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎన్.మాధవి, వైస్ చైర్‌పర్సన్‌గా ఆర్.వెంకటలక్ష్మి, పాత వెంకోజీపాలెం జీవీఎంసీ స్కూల్ కమిటీ చైర్‌పర్సన్‌గా పడాల స్వాతి, వైస్ చైర్మన్‌గా వై.రాములు ఎన్నికయ్యారు.

భవిత కేంద్రాల్లో అర్హులనే చేర్చాలి



మధురవాడ భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ గీత

మధురవాడ: భవిత కేంద్రాల్లో దివ్యాంగులను చేర్పించి సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా భవిత కేంద్రం ఐఈ కో ఆర్డినేటర్ బి.గీత సూచించారు. మధురవాడలోని భవిత కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడ దాతలు సాయంతో నాటిన మొక్కలు, పిల్లలకు అందుతున్న సదుపాయాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గదిలో కేంద్రం నిర్వహణ, ఫిజియోథెరపీ, ఇతర సేవలకు భవనం సరిపోనందున అదనంగా మరో గది నిర్మాణం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో భవిత సెంటర్ టీచర్స్ ఎస్.మహాలక్ష్మి, ఎస్‌కే సలీమ, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

తగరపువలస : భీమిలి మండలం తాటితూరులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి, జిల్లా సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ మాట్లాడుతూ చట్టాలకు అందరికీ అవగాహన వుండాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం, హెల్మెట్ వినియోగం, మైనర్ డ్రైవింగ్, డ్రగ్స్ నివారణపై వివరించారు. తహసీల్దార్ పి.రామారావు, ఎంపీడీవో జానకి, భీమిలి సీఐ డి.రమేష్, ఎస్‌ఐ గంటా హరీష్ పాల్గొన్నారు.

విమ్స్ మైదానంలో పూల మొక్కలు నాటాలి



విమ్స్ ఓపీ ఎదురుగా పచ్చని ఖాళీ మైదానం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో పలు చోట్ల ఖాళీ మైదానాలున్నాయి. ఓపీ ఎదురుగా రెండు వైపులా పచ్చని లేన్లతో కూడిన ఖాళీ స్థలాలు, వైద్య పరీక్షల ల్యాబ్ ఎదురుగా పిచ్చి మొక్కలు, పెద్ద ముళ్లచెట్లతో కూడిన విశాలమైన ఖాళీ స్థలంతోపాటు రిహాబిలిటేషన్ సెంటర్ ఎదురుగా విశాలమైన ఖాళీ స్థలం ఉంది. ఓపీ ఎదురుగా ఉండే స్థలాల్లో గతంలో పచ్చని లేన్లు ఏర్పాటు చేసి పలు రకాల అందమైన పూల మొక్కలు నాటారు. ఇవి కొన్నాళ్ల పాటు విమ్స్‌కు వెళ్లే రోగులు, వారి సహాయకులకు ఆహ్లాదాన్ని ఇచ్చేవి. కరోనా మహమ్మారి సమయంలో విమ్స్ కోవిడ్ రోగులతో నిండిపోవడంతో ఇక్కడ పూల మొక్కలకు సంరక్షణ చేసేవారు లేకుండా పోయారు. దీంతో ఈ మొక్కలు కనుమరుగయ్యాయి. అనంతరం అక్కడ పూల మొక్కల గురించి సిబ్బంది మరిచిపోయారు. దీంతో ఈ ఖాళీ స్థలాలు బోసిపోయాయి. వీటిలో సేదదీరడానికి వీలుగా పార్కు తయారు చేసి పూల మొక్కలు నాటించాలని రోగుల సహాయకులు కోరుతున్నారు.

ఏయూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే వెలగపూడికి వినతిపత్రం అందజేస్తున్న డొక్కర ప్రసాద్ తదితరులు

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఏయూ ఉద్యోగులు గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు వినతిపత్రం అందజేశారు. ఏయూ ఉద్యోగి డొక్కర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యలు విన్నవించారు. 14 అంశాలతో కూడిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. వర్సిటీ ఉద్యోగుల సంఘం ఎన్నికలు త్వరితగతిన నిర్వహించేలా వీసీకి సూచించాలన్నారు. ఏయూలో టైం స్కేల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, 28 డేస్, కాన్సాలిడేట్, ఇతర ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపజేయాలని కోరారు. టైం స్కేల్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచడంతో పాటు పదవీ విరమణ ప్రయోజనాలు రూ.10 లక్షలు అందజేయాలని, సర్వీసులో ఉండగా ఉద్యోగి అకాల మరణం చెందితే తన కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇప్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, వర్సిటీ ఉన్నతాధికారులతో చర్చించాలని కోరారు. మల్లేస్ రెడ్డి, నాగరాజు, గణ, రమేష్, జగన్, రంగనాయకులు, ఒమ్మి శ్రీను, చొప్పా రమేష్, నరసింగరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ గందరగోళం

- ఆశీలమెట్ట సబ్‌వేలో దూసుకెళ్తున్న వాహనాలు
- ఇష్టానుసారంగా రాకపోకలతో ప్రమాదాలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



ఆశీలమెట్ట సబ్‌వే మార్గంలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన చోదకులు

సీతమ్మధార: మూడు పోలీస్ స్టేషన్ల సరిహద్దుగా గల ఆశీలమెట్ట సబ్‌వే మార్గంలో ట్రాఫిక్ మళ్లీ గందరగోళంగా తయారైందని ఆందోళన వ్యక్తమవుతోంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆశీలమెట్ట జోన్–3 ఆఫీస్ వరకు ఈ సబ్ వే మార్గం విస్తరించి ఉంది. టూ టౌన్, త్రీ టౌన్, ద్వారకా జోన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఈ సబ్‌వే మార్గంలో మొదట్లో సిటీ బస్సులు రాకపోకలు సాగించేవి. రెండు వైపులా ట్రాఫిక్ అనుమతించేవారు. అప్పట్లో డివైడర్లు ఉండేవి. తరువాత ఎందుకనో వాటిని తొలగించి ఫుట్‌పాత్‌కు తరలించిన తరువాత మూడు ప్రమాదాలు జరిగాయి. ఇవన్నీ ఆర్టీసీ బస్సుల కారణంగానే జరగడం గమనార్హం. ఈ ప్రమాదాల్లో ముగ్గురు వాహన చోదకులు మరణించారు. దీంతో ద్వారకా పోలీసులు ఈ సబ్‌వే మార్గాన్ని వన్‌వేగా మార్చారు. రామాటాకీస్ నుంచి జీవీఎంసీ కార్యాలయం మీదుగా పాత జైలురోడ్డు వైపు మాత్రమే వాహనాలు అనుమతిస్తున్నారు. సిటీ బస్సులను ఆశీలమెట్ట సిగ్నల్స్ వైపు రూటు మార్చారు.

స్తంభిస్తున్న ట్రాఫిక్

రెండు నెలలుగా ఈ సబ్‌వే మార్గంలో ఇరువైపులా మళ్లీ వాహనాలను అనుమతించడంతో ట్రాఫిక్ గందరగోళంగా తయారైంది. ఆశీలమెట్ట జోనల్ కార్యాలయం ఎదుట వాహన చోదకులు యూ టర్న్ తీసుకునే క్రమంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోతోంది. ఈ సమయంలో వాహన చోదకులు సహనం నశించి బండి హారన్లు మోగించడంతో ఈ ప్రాంతమంతా శబ్ద కాలుష్యంతో నిండిపోతోందని స్థానికులు హడలి పోతున్నారు. దీంతో ఇక్కడ యూ టర్న్ మూసివేయాలని పలువురు సూచిస్తున్నారు.

వాయువేగంతో ఓవర్‌టేక్

గతంలో పోలీస్ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్హా హయాంలో సబ్‌వే మార్గాన్ని పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. కాలక్రమేణా సబ్‌వే మార్గం గురించి పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వల్లే నిత్యం ట్రాఫిక్ గందరగోళంగా ఉంటోందని పలువురు అంటున్నారు. వాస్తవానికి ఈ మార్గంలో వాహనాలు తమ ముందు వాహనాన్ని ఓవర్‌టేక్ చేయకూడదు. ఈ నిబంధనను మీరి పలువురు యువకులు ఇష్టానుసారంగా వాయువేగంతో దూసుకెళ్తున్నారు. లైన్ క్రాస్ చేసి మరీ ముందు వాహనాలను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న వాహన చోదకులను హడలెత్తిస్తున్నారు. ఇక్కడ సిమెంట్ డివైడర్లకు బదులుగా ప్లాస్టిక్ స్టిక్స్ మాత్రమే వాడటం విమర్శలకు తావిస్తోంది. డివైడర్లు రోడ్డు పొడుగునా కాకుండా సబ్‌వే మధ్యలో మాత్రమే ఏర్పాటు చేయడం గమనార్హం. త్రీటౌన్, ద్వారకా, త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి సబ్‌వే మార్గంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

- పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి
- ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను గురువారం నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి సందర్శించారు. కంచరపాలెం పీఎస్ పరిధిలో పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సిబ్బందికి సీపీ సూచించారు. స్టేషన్ ఆవరణ, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

క్రైం సిబ్బంది విధులపై అసంతృప్తి

అనంతరం అదే పోలీస్ స్టేషన్‌లో మేడపైన ఉన్న కంచరపాలెం, ఎయిర్‌పోర్టు క్రైం స్టేషన్లను పోలీస్ కమిషనర్ సందర్శించారు. జీడీ ఎంట్రీ బుక్‌ను పరిశీలించిన ఆయన పుస్తకంలో ఎందుకు వారి వారి ఎంట్రీలను నిర్వహిండం లేదని, వారి కదలికలను ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టు క్రైం స్టేషన్‌లో సిబ్బంది లేకపోవడంతో అక్కడ నుంచే క్రైం డీసీపీ వెంకటరత్నంతో ఫోన్‌లో సీపీ మాట్లాడారు. పలు విషయాలు అడిగి తెలుసుకుని అసంతృప్తి వ్యక్తం చేశారు. క్రైం అధికారులు, సిబ్బంది ఏ సమయానికి వస్తున్నారు, ఏ సమయానికి వెళ్తున్నారో కూడా నమోదు చేయకపోవడంతో వారిపై సీపీ అసహనం వ్యక్తం చేశారు. క్రైం విభాగంలో విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, పైఅధికారుల నుంచి సిబ్బంది వరకు చీవాట్లు పెట్టారు. సీఐ ఎస్.భాస్కరరావు, ఎస్‌ఐ రవికుమార్, క్రైం ఎస్‌ఐ ప్రకాశరావు, ఏఎస్‌ఐ సతీష్ ,సిబ్బంది ఉన్నారు.

వెలమ సామాజిక వర్గానికి ప్రాధాన్యమివ్వండి



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

బీచ్‌రోడ్డు: నామినేటెడ్ పోస్టుల భర్తీలో వెలమ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బీచ్‌రోడ్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో లగుడు గోవిందరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా వెలమ సామాజిక వర్గాన్ని బీ,సీ,డీ జాబితా నుంచి బీసీ–ఏ జాబితాలోకి మార్చాలని ఉద్యమాలు, పోరాటాలు చేస్తున్న తరుణంలో న్యాయం చేయాలన్నారు. వెలమ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, రైతులకు 100 సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని, సంఘానికి స్థలం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.